


# అబద్ధం | చెడినఆడది

రూపాయికి రూపాయిని పుట్టించడమనే విద్య గురవయ్య వంశంలో పెట్టిన విద్య. తండ్రి పోతూపోతూ కొన్ని పాఠాలు చెప్పాడు. "నాయనా, డబ్బు మన కులదేవత. అనుక్షణమూ భక్తితో కొలుచుకో. రూపాయిని రూపాయితో పూజించు. రూపాయిని ఖర్చు పెట్టావంటే మన కులదేవతని అవమానపరచినట్టు లెఖ్ఖ. నేను మూడంతస్తుల మేడ కట్టాను. ఆ పై అంతస్తుల్లో జనం ఎవరూ కాపురం చెయ్యకపోయినా, పావురాళ్ళు, గబ్బిలాలు తిరుగుతున్నా ఆ మేడలో మన కులదేవత ఉంది. తింటే జీర్ణమైపోతుంది. నిలవదు కదా! అంచేత రుచిగా తినాలనే కోరికలు చంపుకో. పైగా రూపాయి అరగదు, కరగదు. అంతకు అంత పెరుగుతుంది."

గురవయ్య ఆ పాఠాల్ని సొంతం వంటపట్టించుకున్నాడు. వ్యాపారంలో తండ్రిని మించినవాడయ్యాడు. పచ్చడి మెతుకులే తినేవాడు. కటిక నేలమీదే పడుకునేవాడు... కట్టుకున్న పెళ్ళానికి కూడా కాసంత బంగారం పెట్టలేదు. వడ్డీలమీద వడ్డీలు పెంచి అంచె లంచెలుగా సంపద పెంచాడు. పై అంతస్తులో

పిచ్చిక గూళ్లు పెరుగుతున్నకొద్దీ ధనలక్ష్మి కరుణిస్తోందని సంబరపడ్డాడు.

ఇంతలో గురవయ్యకి కూతురు పుట్టింది. కూతురు పుట్టినందుకు సంబరం లేకపోగా దిగులు పడ్డాడు. పెరిగిపెద్దయితే కట్న కానుకలిచ్చి పిల్లని ఓ అయ్య చేతిలో పెట్టాలే అని ఇప్పట్నించి ఆలోచనల్లో పడ్డాడు. ముందు ముందు ఖర్చులున్నాయని పట్టుదలగా అప్పులిచ్చి, వడ్డీలు పెంచి సంపాదించాడు. పిల్ల పెరిగి పెద్దదైంది. పెళ్ళి చెయ్యాలి. కట్నం ఇవ్వటం ఇష్టం లేదు. పండగలకి, పబ్బాలకి సారెలూ, చీరెలూ పెట్టటం అంతకన్నా ఇష్టంలేదు. మెరుపులాంటి ఆలోచన వచ్చింది గురవయ్యకి. నూతలపాడులో అనాథగా ఉంటున్న దూరపు బంధువుల పిల్లాడు శంకర్రావు అని ఒకడున్నాడు. రెండో కంటివాడికి తెలియకుండా పిల్లని శంకర్రావు కిచ్చి గుళ్ళో పెళ్ళిచేసి ఇల్లరికపు టల్లుడిగా తెచ్చుకున్నాడు. గురవయ్య మనస్సు స్తిమిత పడింది. లెక్కా డొక్కా చూడటానికి, వసూళ్ళకి, మనిషొకడు దొరికాడు.

గురవయ్యకి బాగానేఉంది కాని శంకరయ్య ఇరుకులో పడ్డాడు. పచ్చడి మెతుకులూ, ఎండలో పడి తిరగటాలూ అతగాడికి నచ్చలేదు. కళ్ళముందు కాసులు కనబడుతూంటే హీనంగా బతకటం అతనికి రోత అనిపించింది. మావ తన్ని పనివాడికంటె హీనంగా, బానిసగా చూస్తుండటంతో మరీ కుంగిపోయాడు. ఈ సంకెళ్ళు తెంపుకోటం ఎలాగో తెలియక గిలగిల్లాడి పోయాడు.

ఒకరోజు గురవయ్య "ముత్తాయిపాలెం వెళ్ళి జానయ్య ఐదువేల రూపాయలు బాకీకింద జమకడ్తానన్నాడు. వసూలు చేసుకురా" అని శంకర్రావుని పంపించాడు. శంకర్రావు సరేనని వెళ్ళిపోయాడు.

పొద్దున వెళ్ళినవాడు సాయంత్రమైనా తిరిగి రాలేదు. రాత్రి పదిగంటలవేళ శంకర్రావు వొగుర్చుకుంటూ వచ్చి "జానయ్య బాకీలేదు! గీకీలేదు! ఫో ఫొమ్మన్నాడు. మీరు పత్రం గిత్రం లేకుండా అంత డబ్బు నోటి మాటమీద అప్పిస్తారా?" అని ఎగిరిపడ్డాడు.

గురవయ్య ఉన్నవాడు ఉన్నట్టు కుప్ప కూలిపోయాడు. నోటమాట రాలేదు. 'ఇంతమోసమా ..... వేలు ..... వేలు .....' అని గొణుక్కుంటూ పిచ్చిచూపులు చూశాడు. వైద్యుడికోసం పరుగెత్తారు. పిచ్చి ముదిరి సంధిలోకి వచ్చింది. అర్థరాత్రివేళ దూలాలకున్న పిచ్చికగూళ్ళు చూస్తూ ప్రాణాలు విడిచాడు గురవయ్య.

శంకర్రావుకి తంతే గారెల బుట్టలో పడ్డట్టయింది. అబద్ధం ఆడి ఐదువేలు దక్కించుకుందామనుకున్నవాడికి ఆస్తంతా చేజిక్కింది! హాయిగా అనుభవించ వచ్చనుకున్నాడు. కాని అదేం చిత్రమో! పచ్చడి మెతుకులకు అలవాటుపడ్డ నోరు పరమాన్నం అసహ్యించుకుంది. నెలతిరిగేప్పటికి జానయ్యవచ్చి ఇంటిమీద పడ్డాడు. "నేను బాకీ ఎగ్గొట్టానా? నన్నీ పరగణాలో అప్రతిష్ఠపాలు చేస్తావా?" అంటూ.

శంకర్రావు తమాయించుకుని జానయ్యని అరుగుమీద కూర్చోపెట్టుకుని సవివరంగా చెప్పాడు. "గురవయ్య మామకి పెద్దతనం వచ్చి కాపీనం పెరిగిపోయింది. డబ్బు తీసుకొచ్చి చేతులో పోసినా, పత్రం, చెల్లు లేవు. కాబట్టి నలుగుర్నీ పిలిచి నీ మీద అభాండం వేశాడు. ఆ పాపం ఆ రాత్రే తిప్పి కొట్టింది కదా, ఇంకెందుకు వెళ్ళిపొండి" అని.

ఓ అబద్ధం కప్పుకుందుకు మరో అబద్ధమే కాక మళ్ళీ మళ్ళీ అబద్ధాలాడాల్సి వచ్చింది. ఎన్నో అబద్ధాలాడి నెట్టుకొస్తున్నా ఎంచేతనో శంకర్రావు నోటికి పచ్చడి మెతుకులు తప్ప పరమాన్నం రుచించటం లేదు. చలవ బట్టలు వొంటిమీద తెలతెలబోతూ గరగరలాడుతూ బాధపెడ్తున్నాయి. నీరుకావి బట్టలే సుఖంగా వున్నాయి. ఈ కథ ఇలా ఉండగా-

సర్వేశ్వరరావు కొంతకాలం క్రితం మీనాక్షి అనే అమ్మాయిని పాలఘాట్ నుంచి తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకొన్నాడు. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకున్నారని కొందరు, లేదు అతగాడి ఉంపుడుగత్తె అనీ ఇంతకుముందే రెండు చేతులు మారిందనీ అనుకొనేవారు. ఎవరేమనుకుంటేనేం సర్వేశ్వరరావు ముచ్చట ఎంతోకాలం

నిలవలేదు. ముప్పయి అయిదేళ్ళ మీనాక్షిని వూరికి వొదిలేసి కాలం చేశాడు సర్వేశ్వరరావు అతను పోవడంతో అందరినోళ్లూ ఊరాయి. మీనాక్షిని తమ దాన్ని చెసుకోవటానికి అందరూ తలో రకంగా ప్రయత్నాలు చేయసాగారు. పైగా ఉంచుకోవటం అంటే ఓ హుందా గదా!

మీనాక్షి ఓ నెలపాటు ఇంట్లోంచి బయటకు రాలేదు. ఆ తర్వాత తప్పలేదు. క్రిష్ణకి నీళ్ళకెళ్ళేది. సాయంత్రాలు గుళ్ళో కెళ్ళేది. బజారుకెళ్ళి తన సరుకులు తనే తెచ్చుకునేది. ఇలా పట్టపగలే ఎక్కడపడితే అక్కడ మెరిసేది మీనాక్షి. దానితో జనం విరగబడ్డారు. నీళ్ళకావిళ్ళు మోసేవాళ్ళు దగ్గర్నించి వ్యాపారస్తులూ. రైతులూ అందరి కళ్లూ ఆశగా చూసేవి.

మీనాక్షి తన్ని కోరుకుంటున్న వాళ్ళందరి గురించి ఆలోచించి 'నగలూ నాణ్యాలూ ఓ పూట పెడ్తారు. రెండోపూట లాక్కొంటారు. కావలసింది అన్నం కదా, గుట్టు చప్పుడుగా ఉంటుంది' అని వంట బ్రాహ్మడైన సుందరయ్యని వరించింది. సుందరయ్య కొండెక్కిపోయాడు. వంటకి పిలిస్తే సగం పిండివంటలు మీనాక్షి ఇంటికి తరలించేవాడు. మీనాక్షికి భోజనం సుష్ఠుగా కుదిరాక చీరల మీదికి పోయింది కోరిక, చీరలమిరాక నగలమీదికి పోయింది మనసు. దాంతో సుందరయ్య పెళ్ళాం, నలుగురు పిల్లలు సంసారం యావత్తూ నలిగి నత్తలైపోయారు.ఇల్లు దోపిడీ అయింది. సంవత్సరం తిరిగేప్పటికి సుందరయ్య గుల్లయిపోయాడు. మనిషి పుల్లలా అయిపోయాడు.

చింతల రేవులో శంకర్రావు, సుందరయ్య స్నానాలు చేస్తున్నారు. గొంతు లోతు నీళ్ళలో నుంచున్నారు. సుందరయ్య శంకర్రావుని చూస్తూ అన్నాడు.

"అదృష్టవంతుడివయ్యా! మావపోవటంతో లక్షలు చేతికొచ్చాయి." శంకర్రావన్నాడు "అదృష్టం నీదయ్యా! మగపురుషుడివి! నీసుఖం ఇంకొకరికేదీ?'

అబద్ధాలతో అందల మెక్కుదామనుకున్న వాడొకడు.

ఆడదాని పొందుకోసం అయినవాళ్ళ కన్యాయం చేసిన వాడింకొకడు.

ఇద్దరూ ఒకళ్ళనిచూసి ఇంకొకళ్ళు దిగులుగా నవ్వుకుని బుడుంగున మునిగారు.*